క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ ప్రత్యేక శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన శిక్షణ శిబిరాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం, కథలు చెప్పడం, డ్రాయింగ్, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రీసోర్స్ పర్సన్స్ డ్రాయింగ్ మాస్టర్ సుందర్రాజు, రవికిరణ్ రెడ్డి, ఇందుమతి, రామ్మోహన్‌రావు తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ వార్షికోత్సవం

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ 65వ వార్షికో త్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వ హించిన వేడుకల్లోసమాఖ్య జెండాను యూనియన్ మాజీ నాయకులు ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్ర మంలో నాయకులు బాబయ్య, బీసన్న, కాశీం, చిన్న, శివ, హుస్సేన్, బాష, మధు, శ్రీనివాసు లు, రాజశేఖర్, శరత్ కుమార్ పాల్గొన్నారు.

రిజిష్టర్లు పక్కాగా నిర్వహించాలి



రిజిష్టర్లను పరిశీలిస్తున్న డీసీపీఓ శారద

కర్నూలు(అర్బన్): చిల్డ్రన్ హోమ్స్‌లో రిజిష్టర్లను పక్కాగా నిర్వహించాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్(డీసీపీఓ) టి.శారద కోరారు. జిల్లాలోని పలు హోమ్స్‌లో రిజిష్టర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందనే ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశాల మేరకు శనివారం స్థానిక జీపీఆర్ నగర్‌లోని విజ్ఞాన పీఠాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంబంధించిన పలు రికార్డులను, రిజిష్టర్లతో పాటు స్నానపు గదులు, టాయ్‌లెట్స్, లివింగ్, బెడ్ రూమ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్సిట్యూషనల్ కేర్ పద్మ, నాన్ ఇన్సిట్యూషనల్ కేర్ దీపారాణి, ఎల్‌సీపీఓ శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

కష్టపడే వారికి పదవులు



కాటసానిని సత్కరిస్తున్న హరినాథ్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో కష్టపడే వారికి పదవులు వరిస్తాయని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా నియమితులైన హరినాథ్‌రెడ్డి శనివారం కాటసానిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలోకి తీసుకెళ్లాలన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం



కర్నూలు సిటీ: ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన సిరాక్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులను ఆ స్కూల్ యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. స్కూల్ అధినేత జీఎండీ ఇబ్రహీం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు ప్రతి ఏటా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అకడమిక్ ప్రారంభం నుంచే ప్రత్యేక ప్రణాళికతో ప్రతి ఒక్క విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మేరి స్వప్న పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేస్తే గుర్తింపు

- ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ సన్మాన కార్యక్రమంలో కలెక్టర్



డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): సేవాభావంతో పనిచేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా చెప్పారు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన డాక్టర్ పి. చంద్రశేఖర్ మొదటిసారిగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయనను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్డియాలజీ విభాగపు అభివృద్ధిలో డాక్టర్ పి.చంద్రశేఖర్ పాత్ర కీలకమన్నారు. ఆయన అందించిన సేవలే నేడు వైస్ చాన్స్‌లర్‌గా చేశాయన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఈ స్థాయిలో ఉండటం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మెడికల్ కాలేజీకి మరింత మంచి జరుగుతుందని, అదనంగా సౌకర్యాలు వచ్చే అవకాశం పుష్కలంగా ఉంటాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను కర్నూలు జిల్లా పర్ల గ్రామానికి చెందిన వాడినని, ఇదే మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించానని గుర్తు చేశారు. వివిధ కోర్సుల అనంతరం కార్డియాలజీ విభాగంలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి వివిధ హోదాలలో 25 సంవత్సరాలు సేవలందించి పదవీ విరమణ చేసినట్లు తెలిపారు. తాను రోగులకు అందించిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు వీసీ పదవి ఇచ్చారన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోండి



విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (సెంట్రల్): ప్రపంచ వ్యాప్తంగా డ్రోన్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతోందని, దీనిని యువత అందిపుచ్చుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్స్‌కు సంబంధించిన ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీడీఎం అధ్యాపకులతో స్వాయాన్ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న డ్రోన్ టెక్నాలజీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నతమైన నైపుణ్యాలు పొందాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ పొందిన 480 మంది విద్యార్థినులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన 480 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధినేత పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ కేతు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బాబు బడాయికి రాష్ట్రం బలి

- వైఎస్సార్‌సీపీ నేత మద్దూరు సుభాష్ చంద్రబోస్



కర్నూలు (టౌన్) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడాయికి రాష్ట్రం బలి అవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. శనివారం స్థానిక సి. క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్లాది ప్రజల కడుపు కొట్టి లక్షల కోట్ల సంపదనంతా అమరావతి రాజధాని అభివృద్ధి పేరుతో దుబారా చేస్తున్నారన్నారు. పెత్తందారులకు మేలు చేసేందుకే సీఎం అమరావతిని నిర్మిస్తున్నారన్నారు. తన నివాసం కోసం 5 ఎకరాల్లో ఇల్లు కట్టుకుంటున్న బాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న పేదలకు ఒక గూడు కట్ట లేదన్నారు. రూ. వేల కోట్లు ఖర్చు చేసి గతంలో కట్టిన అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు తదితర భవనాలు ఉండగా ఇప్పుడు రూ. లక్షల కోట్లు అంచనాలు వేసి మళ్లీ అవే భవనాలు కట్టాలని నిర్ణయించడం సర్కారు బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర సంపదనంతా ఒకే చోట కేంద్రీకరించడం సరికాదన్నారు. మిగతా జిల్లాల అభివృద్ధిని కూడా పట్టించుకోవాలని లేకపోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు.

ఈ రోజు

భగీరథ మహర్షి జయంతి

కర్నూలు(అర్బన్): ఈ నెల 4న శ్రీభగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి కె. ప్రసూన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, సగర/ ఉప్పర సంఘం నాయకులు హాజరు కావాలని కోరారు.

'దేవుడా' శతకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: తెలుగు సారస్వత వైభవం ఆధ్వర్యంలో ఆచార్య గుబ్బా బాలస్వామి రచించిన «దేవుడా» శతకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలుగు సారస్వత వైభవం అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు.

రంగ స్థల కళాకారుల సంఘం సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య తెలిపారు.

పెద్దాసుపత్రికి 30 పడకల విరాళం



నూతన పడకలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగానికి విజయ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.విజయకృష్ణారెడ్డి రూ.10 లక్షల విలువైన 30 అధునాతన పడకలను విరాళంగా అందజేశారు. ఆయన తన తండ్రి, కార్డియాలజీ విభాగం పూర్వ హెచ్‌ఓడి డాక్టర్ టి. రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఈ పడకలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. పేస్‌మేకర్స్ వేయించుకున్న రోగులు, గుండె చికిత్స చేయించుకుంటున్న వారిని జిల్లా కలెక్టర్ పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఇటీవల యూనివర్సిటి టాపర్‌గా నిలిచిన కార్డియాలజి పీజీ డాక్టర్ మహేష్‌కు డాక్టర్ టి. రామకృష్ణారెడ్డి గోల్డ్‌మెడల్ బహూకరించారు. ప్రతి సంవత్సరం తన తండ్రి పేరిట ఉత్తమ విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కార్మికులు,కర్షకులను ఆదుకోవడంలో సర్కారు విఫలం

కర్నూలు(సెంట్రల్):.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షకులను ఆదుకోవడంలో విఫలమయ్యాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. ఈ నేపథ్యంలో మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షు డు వెంకటేశ్వర్లు, కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమ్మె

కర్నూలు(సెంట్రల్): మే 20వ తేదీన దేశవ్యాప్తంగా లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మేడే వారోత్సవాల్లో భాగంగా బస్టాండ్ సమీపంలోని ఉల్చాల, పర్ల, రేమట, మార్కాపురం ఆటో స్టాండ్‌ల్లో అయన ఎర్రజెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి

కర్నూలు(అర్బన్): ఎన్నికల సమయంలో జీఓ నెంబర్: 3కు చట్టబద్ధత కల్పిస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప కోరారు. ప్రత్యేక డీఎస్సీ లేకుంటే ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు పూర్తిగా నష్టపోతారని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

దిగజారిన విద్యా వ్యవస్థ

కర్నూలు సిటీ: ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో విద్యా వ్యవస్థ దిగజారిపోయిందని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు పెద్దయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బిర్లాగేటులోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర, జిల్లా కమిటీకి నూతన అధ్యక్షులను ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు మారుతి, రంగస్వామి, ఉసేన్, రామకృష్ణ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ శిక్షణ

కర్నూలు (సెంట్రల్) : కర్నూలు పార్లమెంటు పరిధిలోని డీఎస్సీ- 2025 సెకండరీ గ్రేడ్ టీచర్ అభ్యర్థులకు వైఈఎస్ పబ్లికేషన్ ద్వారా యూట్యూబ్‌లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. యువజన సంక్షేమ జిల్లా విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలసి ఎంపీ ఆవిష్కరించారు. ఆన్‌లైన్ శిక్షణ కోసం 92922 07601 అనే నంబర్‌కు వాట్సాప్ ద్వారా తమ పేరు, అడ్రస్ వివరాలను తెలుపుతూ ఆధార్ కార్డు డీఈడీ సర్టిఫికెట్ కాపీలను ఈ నెల7 లోపు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ పాల్, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, ఎంప్లాయ్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి పాల్గొన్నారు.

పందులను నగరం బయట పెంచుకోవాలి

కర్నూలు (టౌన్) : రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ జీవో 323 ప్రకారం పందులను నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో పెంచుకోవాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు, పందుల యజమానులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పందుల పెంపకంతో పర్యావరణానికి హానీ, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి సమీపంలోని సర్వే నెంబర్ 362 లేదా 552లో ఉన్న 4.15 ఎకరాల స్థలాన్ని పందుల పెంపకానికి కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి. శ్రీనివాస్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎల్. భాస్కర్, మెప్మా పీడీ నాగశివలీల, పీఆర్ డీఎల్‌పీఓ టి. లక్ష్మి, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు కమిషనర్లు క్రిష్ణ, గంగిరెడ్డి, రమేష్‌బాబు, డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి రంగస్థలంలో శిక్షణ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి రంగస్థలంలో శిక్షణ ఇస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో శిక్షణ ఇస్తున్న ట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిక్షణకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా

కర్నూలు(అర్బన్): కర్నూలు – బళ్లారి రోడ్డులో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డును బళ్లారి చౌరస్తా నుంచి పెద్దపాడు వరకు విస్తరించినా, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. శనివారం సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, శివారు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు బి. అనంత లక్ష్మన్న, ఎంపీ మల్లికార్జున, పి. సూర్యశేఖర్ తదితరులు బళ్లారి రోడ్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మించడమే కాక లైట్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదన్నారు. మెకానిక్ వృత్తిపై జీవించే ఒక యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తు ప్రమాదానికి గురై మృతి చెంది నెల రోజులు గడుస్తున్నా అధికారులు ఇంతవరకు స్పందించలేదన్నారు. కార్యక్రమంలో కె. భోగేశ్వరరెడ్డి, పీటర్, రాబర్ట్, ముల్లర్, రాముడు, రామన్న, నాగేశ్వరరావు, యూనిష్, సీతారామాంజనేయులు, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ముస్లింలకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న హఫీజ్ మహమ్మద్ ఇలియాస్

కర్నూలు(టౌన్): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హఫీజ్ మహమ్మద్ ఇలియాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి రాజధాని పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ ముస్లింలను ఉగ్రవాదులుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా నిరాధార ఆరోపణలు చేయడం ముస్లింల మనోభావాలని దెబ్బతీయడమే అన్నారు. యావత్తు ముస్లిం సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోజువారీ కనీస వేతనాల సవరణ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వంలో వివిధ శాఖలు, సంస్థలు, కార్యాలయాలు,సెమీ గవర్నమెంట్ విభాగాల్లో పనిచేస్తున్న క్యాజువల్, కంటింజెంట్, మస్టర్ రోల్ ఉద్యోగుల రోజువారీ వేతనాన్ని 5 శాతం పెంచి సవరణ చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కార్మిక శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై వేతన సవరణపై సమీక్షించారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ సీతాలక్ష్మి, కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ రాజశేఖర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల్లో పరిశోధనలకు ప్రాధాన్యం

- ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పరిశోధనలకే తొలి ప్రాధాన్యత ఇస్తానని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, వైద్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల విద్యార్థిగా, కార్డియాలజీ హెచ్‌ఓడీగా, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, కేఎంసీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇప్పుడు వీసీ హోదాలో కాలేజీ సందర్శనకు రావడం సంతోషాన్నిచ్చిందన్నారు. వైద్య విద్యార్థులు రీసెర్చ్ కార్యక్రమాల్లో అధికంగా కృషి చేస్తే పేద ప్రజలకు ఆ ఫలితాలు అందుతాయని అన్నారు. తనకు వైద్య విద్యను అందించిన కర్నూలు మెడికల్ కాలేజీ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ కళాశాలలో 2,240 మంది విద్యను అభ్యసిస్తున్నారని, కళాశాల హాస్టల్‌లో అదనపు గదుల నిర్మాణ ఆవశ్యకతను ఆమె వివరించారు. కొత్తగా పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేశామని, వాటికి అనుమతి ఇప్పించాలని కోరారు. అనంతరం ఆయనను అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ పీఎస్‌కే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఉషూ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 13, 14 తేదీల్లో స్థానిక బి.క్యాంపులోని టీజీ లక్ష్మీ వెంకటేష్ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, ఉషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఉషూ పోటీలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీజీవీ, టీజీవీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నా రు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు, ఉషూ సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు, తైక్వాండో సంఘం ప్రతినిధులు సతీష్ కుమార్, వీరేష్ బాబు, మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

6న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సబ్ జూనియర్ బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 15 నుంచి 18 వరకు చిత్తూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.జనవరి 1 వ తేదీ 2012 సంవత్సరం తరువాత జన్మించి, పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉంటే తమ జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9985161007 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ దాడులు



సారా బాటిళ్లు, బిందెలు సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: స్థానిక బంగారుపేట శివారులోని కేసీ కెనాల్ గట్టుపైనున్న నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, ఈఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, సీఐ చంద్రహాస్, ఎస్ఐలు రెహనా, రవితేజ, సిబ్బంది చంద్రపాల్, రామలింగయ్య, మధు, లక్ష్మీబాయి, సువర్ణమ్మ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసగౌడు తదితరులు బృందాలుగా ఏర్పడి శనివారం నాటుసారా స్థావరంపై దాడి చేసి బట్టీలను ధ్వంసం చేశారు. దాదాపు 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. బంగారుపేటలో సారా విక్రయాలు జరుపుతున్న నీలిషికార్లు రాజమ్మ, రోజా, భారతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. విచారణలో భాగంగా నాటుసారా తయారీకి ఉపయోగించిన బెల్లం ఎక్కడ కొనుగోలు చేశారనే విషయంపై విచారణ జరపగా నందికొట్కూరుకు చెందిన నారాయణ వద్ద కొనుగోలు చేసినట్లు తేలడంతో ఆయనపై కూడా కేసు నమోదు చేశారు. అలాగే ఓర్వకల్లుకు చెందిన శారద వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు. నిరంతరం దాడులు చేస్తున్నప్పటికీ సారా తయారీ, రవాణా, విక్రయదారులు తమ వృత్తిని మానుకోవడం లేదని, పదేపదే ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న వారిపై ఇకపై పీడీ కేసులు నమోదు చేసి జైలుకు పంపనున్నట్లు సీఐ తెలిపారు.

రిటైర్డ్ డీఈకి సైబర్‌నేరగాళ్ల టోకరా!

కర్నూలు: స్థానిక వెంకటరమణ కాలనీలో నివాసముంటున్న సుధీందర్ రావును సైబర్ కేటుగాళ్లు బోల్తా కొట్టించారు. ఈయన పంచాయతీరాజ్ శాఖలో డీఈగా పనిచేసి 23 ఏళ్ల క్రితం పదవీ విరమణ పొంది ఇంటి దగ్గర ఉంటున్నారు. బజాజ్ అవంతిక గ్రూప్‌లో చేరమని ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో గత సంవత్సరం ఆయన సెల్‌ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. దానిని పరిశీలించి నిజమేనని భావించిన డీఈ లింక్ పంపిన వారితో సంప్రదించాడు. ముందుగా రూ.2 లక్షలు తమ ఖాతాకు చెల్లించి ఆ తర్వాత బీఆర్ బ్లాక్స్ మాక్సీ అనే ట్రేడింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమని ఓ మహిళ సూచించగా అందుకు అంగీకరించి ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. తర్వాత యాప్‌లో విడతల వారీగా రూ.54.44 లక్షలు సైబర్ కేటుగాళ్లు చెప్పిన ఖాతాల్లో పెట్టుబడి పెట్టాడు. ఇందుకుగాను ట్రేడింగ్ ఖాతాకు రూ.9.26 కోట్లు జమ అయిందని, అది డ్రా చేసుకోవా లంటే రూ.2 కోట్లు చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు నమ్మబలికారు. అయితే తెలిసినవారిని సంప్రదించి మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్ష

కర్నూలు(హాస్పిటల్): టీకాలు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని డెమో శ్రీనివాసులు శెట్టి అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డు యూపీహెచ్‌సీ పరిధిలోని అశోక్‌నగర్–2 సచివాలయంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణిలు, పిల్లలకు సమయానుసారంగా టీకాలు ఇప్పించాలన్నారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు కిల్కారి మెసేజ్‌ను గర్భిణిలందరూ క్రమం తప్పకుండా అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు షైనీ, రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.